30-07-2025
బుధవారం
మల్కాజిగిరి
jayabherinews
ప్రభాత
JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 67 | పేజీలు : 8 | వెల : 5
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి

# పాక్ అణ్వాయుధ బెదిరింపులకు తలొగ్గం



- ఎటువంటి యుద్ధ వ్యూహాలనైనా భారత్ తిప్పికొడుతుందన్నారు
- రాజ్యసభలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

**జయభేరి, న్యూఢిల్లీ జూలై 29:**

ఆపరేషన్ సింధూర్‌పై మంగళవారం రాజ్యసభలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చర్చను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాకిస్థాన్ చేపడుతున్న అణ్వాయుధ బెదిరింపులకు భారత్ తలవంచదు అని పేర్కొన్నారు. ఎటువంటి యుద్ధ వ్యూహాలనైనా తిప్పికొడుతుందన్నారు. ఉగ్రవాదానికి భారత్ వ్యతిరేకమన్న ఉద్దేశాన్ని చాటేందుకు ఆపరేషన్ సింధూర్ సంకేతంగా నిలుస్తుందని, కానీ గత ప్రభుత్వాలు దశాబ్దాల క్రితమే ఇలాంటి చర్యలను చేయాల్సి ఉండే అని అన్నారు.ఒకవేళ పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని రూపుమాపాలనుకుంటే, ఆ దేశానికి సహకారం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. భారత్, పాకిస్థాన్ దేశాలు ఒకేసారి స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటాయని, కానీ పాకిస్థాన్‌ను ఉగ్రవాద కేంద్రంగా భావిస్తున్నారని, ఇండియాను మాత్రం ప్రజాస్వామ్యానికి తల్లిగా భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఉగ్రవాదం నుంచి ఎటువంటి విప్లవం పుట్టదు అని, దాని వల్ల కేవలం విధ్వంసం, ద్వేషమే మిగులుతుందన్నారు. ఉగ్రవాదులేమీ ఫ్రీడం ఫైటర్లు కాదన్నారు.ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ ఎన్ని యుద్ధ విమానాలను కోల్పోయిదన్న విషయాన్ని విపక్షాలు ఎందుకు అడగడం లేదన్నారు. కానీ భారతీయ యుద్ధ విమానాల గురించి

...మిగతాది 2 లో



# బీఆర్ఎస్ నయా ప్లాన్

**బీసీ రిజర్వేషన్ల కోసం రంగంలోకి బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు**

**జయభేరి, హైదరాబాద్ :**

బీసీ రిజర్వేషన్ల కోసం బీఆర్ఎస్ పోరుబాట పట్టనుంది. ఇందులో భాగంగానే బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు రంగంలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ వెళ్లి రాష్ట్రపతిని కలవాలని బీఆర్ఎస్ హై కమాండ్ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్‌లోని బీసీ నేతలతో కలసి ఢిల్లీలో రాష్ట్రపతిని కలవడానికి నయా ప్లాన్ చేశారు. ఆగస్ట్ 8వ తేదీన కరీంనగర్‌లో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ నిర్వహించడానికి ప్లాన్ చేసింది. కరీంనగర్ సభ వేదికగా బీసీ రిజర్వేషన్లకు తాము అనుకూలంగా ఉన్నామనే స్పష్టమైన ప్రకటన ఇవ్వాడానికి బీఆర్ఎస్ హై కమాండ్ ఓ కార్యాచరణ రూపొందించింది. ఈ సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పాల్గొననున్నారు. బీసీ రిజర్వేషన్ల గురించి కాంగ్రెస్, బీజేపీ నేతల వైఖరిని కేటీఆర్ ప్రశ్నించనున్నారు.కాగా, బీసీ రిజర్వేషన్ల కోసం బీఆర్ఎస్ కార్యాచరణ రూపొందించింది. తెలంగాణ భవన్‌లో ఇవాళ (మంగళవారం జులై 29) బీఆర్ఎస్ బీసీ నాయకుల సమావేశం జరిగింది. కాంగ్రెస్‌కు పోటీగా ఢిల్లీ వెళ్లి రాష్ట్రపతిని కలవాలని బీఆర్ఎస్ హై కమాండ్ నిర్ణయం తీసుకుంది. బీసీ రిజర్వేషన్ల కోసం ఆగస్ 8వ తేదీన కరీంనగర్‌లో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ నిర్వహించడనికి ప్లాన్ చేసింది. ఈ క్రమంలో తెలంగాణ భవన్‌లో మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మీడియాతో మాట్లాడారు. బీసీ బిల్లుపై కాంగ్రెస్, బీజేపీలు కలసి డ్రామాలాడుతున్నాయని ఆరోపించారు. ఈ నెపాన్ని కేంద్ర ప్రభుత్వంపై నెట్టి కాంగ్రెస్ తప్పుకుంటోందని మండిపడ్డారు. బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే.. మిగిలిన మూడు మంత్రి పదవులను బీసీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో డ్రామాలు ఆపాలని తలసాని శ్రీనివాస్ యాదవ్ హితవు పలికారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పాటు



- ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే

**జయభేరి, న్యూఢిల్లీ, జూలై 29:**

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పాటయ్యాయ్యాయని ఎఐసిసి మల్లికార్జున ఖర్గే తెలిపారు. తమరు ప్రభుత్వ రంగ కార్ఖానాలు కాదు.. అబద్ధపు కార్ఖానాలు ఏర్పాటు చేశారని అన్నారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సింధూర్ పై రాజ్యసభలో చర్చ జరిగింది. ఈ చర్చలో మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. కీలకమైన అంశంపై పార్లమెంటు లో చర్చ జరుగుతుంటే ప్రధాని నరేంద్రమోడీ సభలో లేరని, కీలకమైన చర్చను వదిలేసి బిహార్ ఎన్నికల ప్రచారానికి వెళ్లారని విమర్శించారు. పహల్గాం ఉగ్రదాడి ఈ ఏడాది ఏప్రిల్ నెలలో జరిగిందని తెలియజేశారు. పార్లమెంటుకు రాకుండా ఎన్నికల ప్రచారానికి వెళ్లడమే దేశభక్తి అవుతుందా? అని ప్రశ్నించారు.పహల్గాం దాడి తర్వాత పార్లమెంటు సమావేశాలు నిర్వహించాలని అడిగితే మోడీ స్పందించలేదని, ఘటన జరిగిన 3 నెలల తర్వాత పార్లమెంటులో చర్చ పెట్టారని మండిపడ్డారు. విపక్షాలు పాకిస్థాన్‌కు మద్దతు ఇస్తున్నాయని అసత్య ఆరోపణలు చేస్తున్నారని,



# నాగార్జున సాగర్ క్రస్ట్ గేట్ల ద్వారా నీరు విడుదల

- నాగార్జునసాగర్ ప్రాజెక్టు చరిత్రలో మొదటిసారిగా 18 సంవత్సరాల తర్వాత జూలై నెలలోనే సాగునీటి విడుదల
- నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఒక ఆధునిక దేవాలయం
- రాష్ట్రంలోని ప్రాజెక్టులను ఆధునికరిస్తాము. పూడిక తీస్తాం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.

**జయభేరి, నల్గొండ జూలై 29 :**

రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను ఆధునికరిస్తామని, అలాగే పూడిక తీస్తామని, రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ,మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి, నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లతో కలిసి నాగార్జునసాగర్ క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. స్వర్గీయ ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ చేతుల మీదుగా శంకుస్థాపన చేయబడిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఒక ఆధునిక దేవాలయం అని అన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లలోని 22 లక్షల ఎకరాలకు సాగునీరు తుందని చెప్పారు. జవహర్ కుడి కాలువ ద్వారా 11.74 లక్షల ఎకరాలు, లాల్ బహదూర్ ఎడమ కాలువ ద్వారా 10.38 లక్షల ఎకరాలకు నీరు అందిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో మొత్తం 6 లక్షల 50వేల ఎకరాలకు సాగు నీరు అందుతుండగా, నల్గొండ జిల్లాలో 1,50,000 ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో రెండు లక్షల 30 వేల ఎకరాలు, ఖమ్మం జిల్లాలో రెండున్నర లక్ష ఎకరాలకు ఆయకట్టుకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా సాగునీరందుతున్నదని తెలిపారు. 2005 సంవత్సరంలో నాగార్జున సాగర్

...మిగతాది 2 లో

# మూసి నది గర్భంలో ఆక్రమణలను తొలగించిన హైడ్రా



2 లో

- హైడ్రా చర్యలపై హర్షం వ్యక్తం చేసిన పరిసర ప్రాంతాల ప్రజలు

**జయభేరి, హైదరాబాద్ :**

మూసీ నది గర్భంలో ఆక్రమణలను తొలగించిన హైడ్రా. చాదరఘాట్ బ్రిడ్జి నుంచి పాత బస్తీ ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ వరకు పలు ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగింపు. వాహనాల పార్కింగ్ కోసం వినియోగిస్తున్న ఆక్రమణ దారులు.



2 లో

# ముఖ్యమంత్రి మార్పు

- ఎమ్మెల్యేలతో సిద్ధిరామయ్య సమావేశం.. డీకే దూరం

**జయభేరి, బెంగళూరు :**

కర్ణాటకలో 'ముఖ్యమంత్రి మార్పు' అంశం చర్చనీయాంశంగా మారింది. తాజాగా, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఎమ్మెల్యేలతో సమావేశమవుతున్నారు. ఈ భేటీకి ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. అభివృద్ధి పనుల నిమిత్తం ఒక్కో ఎమ్మెల్యేకు రూ. 50 కోట్ల



# అమరావతి అభివృద్ధిలో సింగపూర్ ఈజ్ బ్యాక్

2 లో

ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రుల బృందం సింగపూర్ పర్యటనలో ఫలితాలు వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిగిన భేటీ పై సింగపూర్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్మెంట్ మంత్రి టాన్ సీ లెంగ్ కీలక ప్రకటన చేశారు. ఏపీ, అమరావతి అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యం కొనసాగుతుందని సింగపూర్ వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి టాన్ సీ లెంగ్ స్పష్టం చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటన సక్సెస్ కావాలని ఆయన ఆకాంక్షించారు. 'భారత్ లో అత్యంత వేగంగా ఎదుగుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. ఏపీలో పెట్టుబడులు, కార్యకలాపాల విస్తరణకు సింగపూర్ కంపెనీలు ఆసక్తిగా ఉన్నాయి. పోర్టులు, గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ టెక్నాలజీ , నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ఏపీలో పెట్టుబడులపై సీఎం చంద్రబాబుతో చర్చించాం.

▶▶ మొదటిపేజీ తరువాయి

## నాగార్జున సాగర్ క్రస్ట్ గేట్ల ద్వారా నీరు విడుదల

ప్రాజెక్టు స్వర్ణోత్సవాలు. నిర్వహించడం జరిగిందని చెప్పారు. తను ఆరుసార్లు శాసనసభ్యుడిగా, ఒకసారి పార్లమెంటు సభ్యునిగా ఉంటూ ఇప్పుడు ఇరిగేషన్ ప్రాజెక్టు మంత్రిగా నాగార్జున సాగర్ ద్వారా నీటిని వదలడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత గత వానాకాలం, యాసంగి, వానాకాలం కలిసి రెండు లక్షల 81 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని. పండించడం జరిగిందని, ఇందులో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ పాత్ర ముఖ్యమని అన్నారు. సాగునీటితో పాటు నాగార్జున సాగర్ పవర్ ప్రాజెక్ట్ ద్వారా గడచిన 4 రోజులుగా 30000 క్యూసెక్కుల నీటినితో పూర్తిస్థాయిలో, 700 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేశామన్నారు.

## పాక్ అణ్వాయుధ బెదిరింపులకు తలొగ్గం

మాత్రమే ప్రశ్న వేస్తోందని విమర్శించారు. ఏదో ఒక రోజు పీవోకే ప్రజలు ఇండియాతో కలుస్తారని, భారతీయులమని చెప్పుకునేందుకు వాళ్లు గర్వపడుతారని రాజ్‌నాథ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు కేవలం కామా మాత్రమే పెట్టామని, ఫుల్ స్టాప్ పెట్టలేదన్నారు.కాల్పుల విరమణకు ఎందుకు అంగీకరించారని వస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ.. ఆపరేషన్ సింధూర్ లక్ష్యం కేవలం పాకిస్థాన్‌ను శిక్షించడమే అని, కానీ ఆ దేశంపై యుద్ధం చేయడం తమ ఉద్దేశం కాదన్నారు. పాకిస్థాన్‌లో ఉన్న 9 ఉగ్ర స్థావరాలపై ఇండియా దాడి చేసిందని, ఆ దాడిలో ఒక్క పాకిస్థానీ పౌరుడు కూడా మరణించలేదని మంత్రి రాజ్‌నాథ్ పేర్కొన్నారు.మరో వైపు లోక్‌సభలో హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన ప్రసంగంపై ప్రధాని మోదీ తన ఎక్స్ అకౌంట్లో ట్వీట్ చేశారు. ఆపరేషన్ సింధూర్, ఆపరేషన్ మహాదవ్‌పై ఆ ప్రసంగంలో పూర్తి వివరాలు ఉన్నట్లు పేర్కొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పాటు

అసత్యాలతో ఎక్కువకాలం ప్రజలను మభ్య పెట్టలేరని అన్నారు. తాము ఎప్పుడూ పాకిస్థాన్ కు మద్దతు ఇవ్వలేదని, ఇవ్వబోము అని చెప్పారు. కాంగ్రెస్ దేశాన్ని నిర్మించిన పార్టీ.. కాంగ్రెస్ కు చాలా చరిత్ర ఉందని కొనియాడారు. పహల్గాం ఘటనతో సంబంధం లేని అంశాలను లేవనెత్తుతున్నారని, పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని పోషిస్తోందని ధ్వజమెత్తారు. తాము మొదట నుంచి చెబుతున్నామని, ఉగ్రవాద సమస్య బిజెపి హయాంలో మూడింతలు అయ్యిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రవాదాల మూలాలు దెబ్బతీస్తున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా జమ్మూ కశ్మీర్ పర్యటనలో చెప్పారని అన్నారు. పాక్ ఉగ్రవాదులు పహల్గాం వరకు ఎలా వచ్చారని, పహల్గాం దాడికి 3 రోజుల ముందు ప్రధాని జమ్మూ పర్యటన రద్దు చేసుకున్నారని ఎద్దేవ చేశారు. ప్రధాని పర్యటన రద్దు చేసుకుంటారని.. పర్యాటకులను ఎలా అనుమతించారని నిలదీశారు. పహల్గాం దాడి కచ్చితంగా భద్రతా వైఫల్యమని జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ అన్నారని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. అన్నీ తన ఘనతగా చెప్పుకునే జవాబుదారీ మోడీ.. పహల్గాం ఘటనకు ఎందుకు బాధ్యత వహించరు? అని మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. సైనికులు సాధించిన విజయాన్ని కూడా రాజకీయం చేయడం తగదని.. ఆపరేషన్ సిందూర్ లో భారత విజయంపై కాంగ్రెస్ కూడా విజయోత్సవ ర్యాలీలు నిర్వహించిందని మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు.

## ముఖ్యమంత్రి మార్పు

గ్రాంట్ ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇటీవల ప్రకటించారు. ఆ నిధుల కేటాయింపునకు సంబంధించి సిద్ధరామయ్య విధానసౌధలో సమావేశం కానున్నారు.కీలక సమావేశానికి డీకే శివకుమార్ దూరంగా ఉండటం ఆందోళన కలిగిస్తోందని కొంతమంది కాంగ్రెస్ నాయకులు చెబుతుండగా, ఇదేం కొత్త కాదని అధికార వర్గాలు తెలిపాయి. గతంలోను తన పదవీ కాలంలో పలు సమావేశాలకు ఆయన దూరంగా ఉన్నారని చెబుతున్నారు. డీకే శివకుమార్ ప్రస్తుతం అనారోగ్యంతో ఉన్నారని, అందుకే ఆయన సమావేశానికి హాజరుకాలేకపోతున్నారని మరికొందరు అంటున్నారు.సాధారణంగా ఇలాంటి సమావేశాలు కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యాలయాల్లో జరుగుతాయి. ఈసారి విధానసౌధలో ముఖ్యమంత్రి ఛాంబర్‌లో నిర్వహిస్తున్నారు. డీకే శివకుమార్‌ను దూరం పెట్టడానికే విధానసౌధలో ఈ సమావేశం జరుగుతోందనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి.

## మూసి నది గర్భంలో ఆక్రమణలను తొలగించిన హైడ్రా

చదును చేసి షెడ్డు లు నిర్మించి కిరాయికి ఇస్తున్న కబ్జాదారులు. మూసీ ఆక్రమణలపై హైడ్రాకు ఫిర్యాదులు నేపథ్యంలో చర్యలు. 3.10 ఎకరాల మేర కబ్జా చేసి షెడ్డు నిర్మించి అక్రమ వ్యాపారం చేస్తున్న తికారం సింగ్. 1.30 ఎకరాల మేర కబ్జా చేసిన పూనమ్ చాంద్ యాదవ్. 5.22 ఎకరాల మేర కబ్జా చేసిన జయకృష్ణ. కబ్జా చేసిన వారంతా అక్కడ షెడ్డు లు వేసి.. వాటిని అద్దెకు ఇచ్చి వ్యాపారం చేస్తున్నట్టు వెల్లడి. బస్సులు, లారీల పార్కింగ్ కోసం కిరాయికి ఇస్తూ వినియోగం. అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్టు పరిసర ప్రాంతాల ప్రజల ఫిర్యాదు. నర్సరీ బిజినెస్ నిర్వహణ. మూసి గర్భంలో మట్టిపోసి షెడ్డు ల నిర్మాణం. ఆక్రమణలను తొలగిస్తున్న హైడ్రా. హర్షం వ్యక్తం చేసిన పరిసర ప్రాంతాల ప్రజలు. హైడ్రాకు ఫిర్యాదు చేసిన వెంటనే చర్యలు తీసుకోవడం పట్ల కృతజ్ఞతలు తెలిపిన ప్రజలు.

## డిప్యూటీ సీఎం పర్యటనలో ప్రోటోకాల్ రగడ..!

- ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలో కనిపించను చీఫ్ విప్ మహేందర్ రెడ్డి ఫోటోలు



**జయభేరి, తాండూరు:**

తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యటనలో అధికారులు ప్రోటోకాల్ పాటించడంలేదని లేదని చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి అభిమానులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మంగళవారం తాండూర్ నియోజకవర్గంలో యాలాల మండలం దౌవులాపూర్ లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, తెలంగాణ ప్రభుత్వం చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తదితరులతో కలిసి రూ.230 కోట్లతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవనానికి శంకుస్థాపన, 6 విద్యుత్ సబ్ స్టేషన్ ల కు శంకుస్థాపనలు చేశారు.అయితే విద్యుత్ అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో చీఫ్ విప్ మహేందర్ రెడ్డి ఫోటోలు కనిపించలేదు.దీంతో పట్నం అభిమానులు విద్యుత్ అధికారుల తీరుపై మండిపడ్డారు. దీంతో మహేందర్ రెడ్డి అభిమానులు నిరాశ చెందారు. వికారాబాద్ జిల్లా తాండూరు పర్యటనలో ఉన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ను బిజెపి శ్రేణులు అడ్డుకున్నాయి. ఇటీవల కాగ్నా నది బ్రిడ్జిపై పడ్డ రంధ్రం వద్ద డిప్యూటీ సీఎం కాన్వాయిని అడ్డుకునే ప్రయత్నం చేయగా బిజెపి నేతలను పోలీసులు అరెస్టు చేశారు. దీంతో బిజెపి నాయకులు పోలీసులు నశించాలి అంటూ ఆందోళన చేశారు.

# లే ఆఫ్స్ సీజన్

**రప్పా.. రప్పా.. ఇటీవల చాలా ఫేమస్ అయిన డైలాగ్ ఇది. పుష్ప2 సినిమాలోని ఈ డైలాగ్ ఇటీవల రాజకీయాల్లో వాడుతున్నారు. ఇప్పుడు ఇదే డైలాగ్ ఐటీ కంపెనీలను కూడా తాకింది. ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విశ్వరూపం చూపిస్తూండటంతో ఐటీ రంగంలో అనిశ్చితి ప్రారంభమయింది. దిగ్గజాలు కూడా ఉద్యోగుల్ని భారీగా తొలగిస్తున్నాయి. ఏఐ రంగంలో నియామకాలు చేపడుతున్నాయి. లే ఆఫ్స్ చేయకుండా ఆపలేకపోతున్నామని సుందర్ పిచాయ్, సత్యానాదెళ్ల లాంటి వారు ఆవేదన చెందుతున్నారు. ఆ ప్రక్రియ ఇప్పుడు ఇండియాకు పాకినట్లుగా కనిపిస్తోంది.**

టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ తన మ్యాన్ పవర్‌లో రెండు శాతాన్ని తగ్గించుకోవాలని నిర్ణయించుకుంది. దీంతో ఇండియా ఐటీ రంగంలోనూ లే ఆఫ్స్ భయం ప్రారంభమయింది.టీసీఎస్ లో ఆరు లక్షలకు మందికిపైగా ఉద్యోగులు ఉన్నారు. వీరిలో పన్నెండు వేల మందికి లేఆఫ్స్ ప్రకటించనుంది. ఇందకు ముందే టీసీఎస్ ఓ విధానపరమైన నిర్ణయం తీసుకుంది. అత్యధిక కాలం బెంచ్ పై ఉండే ఉద్యోగుల్ని పంపించేయాలని డిసైడ్ అయింది. బెంచ్ పై ఉండేవాళ్లు.. తమ స్కిల్స్ ను ఎప్పటికప్పుడు అప్డేట్స్ చేసుకునే అవకాశం కంపెనీ ఇస్తుంది. దాని ప్రకారం అప్ డేట్ చేసుకుని ఏదో ఓ ప్రాజెక్టులో చేరిపోతే ఉద్యోగం ఉంటుంది. లేదంటే పోతుంది. ఇలా వారిని ఉద్యోగాల్లో ఉంచడానికి, ఉండటానికి అన్ని అవకాశాలు కల్పించిన తర్వాతనే లేఆఫ్స్ ప్రకటిస్తున్నారు కానీ.. వర్క్ లో ఉండగా.. మెయిల్స్ పంపడం లేదు.ప్రాజెక్టులు వస్తున్నప్పుడు ఐటీ కంపెనీలు.. బెంచ్ స్ట్రెంత్ నూ ఉంచుకుంటాయి. ఒకప్పుడు మ్యాన్ పవర్ అందుబాటు తక్కువగా ఉండేది. ఇప్పుడు ఓవర్ ఫ్లో అవుతోంది. పైగా ఆటోమేషన్ , ఏఐ సాంకేతికతలు రొటీన్ టాస్క్‌ల అవసరాన్ని తగ్గిస్తున్నాయి. ముఖ్యంగా మాన్యువల్ టెస్టింగ్ వంటి రోల్స్‌లో అవకాశాలు తగ్గిపోతున్నాయి. ఇతర సంస్థలు కూడా ఇదే దారిలో నడిచే అవకాశం ఉందని ఇండస్ట్రీ నిపుణులు చెబుతున్నారు. ఇన్ఫోసిస్, విప్రో వంటి ఇతర ఐటీ సంస్థలు లాభదాయకతను కాపాడుకోవడానికి , క్లయింట్ డిమాండ్‌లకు అనుగుణంగా ఉండటానికి ఇలాంటి లేఆఫ్స్‌ను అనుసరించవచ్చని అంచనా. సైబర్‌సెక్యూరిటీ, డిజిటల్ ఇంజనీరింగ్ వంటి అధునాతన సాంకేతికతలలో స్కిల్ గ్యాప్ కారణంగా ఈ లేఆఫ్స్ జరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు సీనియర్ ఉద్యోగులు, ముఖ్యంగా మిడిల్ మేనేజ్‌మెంట్‌లో ఉన్నవారు, కొత్త సాంకేతికతలకు అనుగుణంగా రీస్కిల్ చేసుకోవడంలో విఫలమవుతున్నారు. ఏఐ , ఆటోమేషన్ ఐటీ రంగాన్ని రీషేప్ చేస్తున్నాయి. ఇది రీస్కిల్లింగ్ , అప్‌స్కిల్లింగ్ అవసరాన్ని బలంగా చెబుతోంది. సంస్థలు హైవాల్యూ సర్వీసెస్ , అధునాతన సాంకేతికతలపై దృష్టి సారిస్తున్నాయి. ఈ దిశగా ఉద్యోగులు దృష్టి పెట్టాల్సిందే.భారత ఐటీ రంగంలో అగ్రగామి సంస్థగా ఉన్న టాటా కన్సల్టెన్సీ





సర్వీసెస్(టీసీఎస్) సంస్థ అచ్చం ఈ డైలాగ్ తరహాలోనే ఉద్యోగులను ఊచకోత కోస్తోంది. 2025లో 12,261 ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించింది, ఇది దాని మొత్తం 6,13,069 మంది ఉద్యోగుల లో 2%ని సూచిస్తుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు, నైపుణ్య అసమానతలు ఈ లేఆఫ్‌లకు ప్రధాన కారణాలుగా సంస్థ చెబుతోంది.

ఈ నిర్ణయం మిడిల్, సీనియర్ స్థాయి మేనేజర్‌లపై ఎక్కువ ప్రభావం చూపనుంది, ఇది ఐటీ రంగంలో ఉద్యోగ భద్రతపై ఆందోళనలను రేకెత్తిస్తోంది.టీసీఎస్ సీఈఓ కె.కృతివాసన్ ప్రకారం, 12,261 ఉద్యోగుల తొలగింపు నిర్ణయం అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు, ఏఐ ఆధారిత ఆపరేటింగ్ మోడల్‌లు, నైపుణ్య అసమానతల కారణంగా తీసుకోబడింది. కంపెనీ గతంలో ఉద్యోగుల శిక్షణ, రీస్కిల్లింగ్‌పై గణనీయమైన పెట్టుబడులు పెట్టినప్పటికీ, ఆశించిన ఫలితాలు రాకపోవడంతో ఈ చర్య అనివార్యమైందని పేర్కొన్నారు. ఈ లేఆఫ్‌లు ప్రధానంగా మిడిల్, సీనియర్ స్థాయి మేనేజర్‌లను లక్ష్యంగా చేసుకున్నాయి. వీరికి ఇప్పటికే ఈమెయిల్ ద్వారా సమాచారం అందించబడింది. ఈ నిర్ణయం టీసీఎస్ యొక్క భవిష్యత్‌సిద్ధమైన వ్యూహంలో భాగంగా, ఏఐ, కొత్త టెక్నాలజీలలో పెట్టుబడులను పెంచడానికి తీసుకున్న చర్యగా టీసీఎస్ పేర్కొంటోంది.కఠినమైన బెంచ్ పాలసీ ఈ లేఆఫ్‌లలో కీలక పాత్ర పోషించింది. కంపెనీ నిబంధనల ప్రకారం, ఉద్యోగులు ఏడాదిలో కనీసం 225 రోజులు ప్రాజెక్టులలో చురుకుగా పనిచేయాలి, బెంచ్‌పై (ప్రాజెక్టు లేని స్థితిలో) గరిష్టంగా 35 రోజులు మాత్రమే ఉండాలి. ఈ పాలసీని అమలు చేయడంలో విఫలమైన ఉద్యోగులను లేఆఫ్ పేరుతో తొలగిస్తోంది. ఈ విధానం ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడిని కలిగిస్తోంది. కొంతమంది ఈ విషయంలో కోర్టును ఆశ్రయించారు. ఈ ఒత్తిడి, అనిశ్చితి ఉద్యోగుల మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోంది.రంగంలో కొత్త నియామకాలు 2025లో 72% తగ్గాయి. ఇది ఉద్యోగ ఆకాంక్షులకు, ప్రస్తుత ఉద్యోగులకు సవాల్‌గా మారింది. టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో వంటి అగ్ర కంపెనీలు కొత్త రిక్రూట్‌మెంట్‌ను దాదాపు నిలిపివేసి, ఉన్న ఉద్యోగులను తగ్గించడంపై దృష్టి సారించాయి. ఈ పరిస్థితి ఐటీ నిపుణులలో ఆందోళనను పెంచుతోంది, ఎందుకంటే కొత్త అవకాశాలు లేకపోవడంతో పాటు ఉన్న ఉద్యోగాలు కూడా ఊడిపోతున్నాయి. ఈ తగ్గుదల కారణంగా, ఐటీ రంగం ఒకప్పుడు రంగుల ప్రపంచంగా భావించబడిన ఆకర్షణను కోల్పోతోంది.ఆధారిత ఆటోమేషన్, అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు టీసీఎస్ లేఆఫ్‌లకు ప్రధాన కారణంగా సీఈవో వెల్లడించారు. ఏఐ ఆపరేటింగ్ మోడల్స్ సంప్రదాయ ఐటీ రోల్స్‌ను తగ్గిస్తున్నాయి. క్లయింట్ డిమాండ్‌లో సంకోచం కంపెనీలను ఖర్చు తగ్గింపు చర్యలకు ఒత్తిడి చేస్తోంది. టీసీఎస్ ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి ఏఐ, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీలో పెట్టుబడులను పెంచుతోంది, కానీ ఆశించిన ఫలితాలు రావడం లేదని సీఈవో వెల్లడించారు. మరో వైపు సాఫ్ట్ వేర్ ఇండస్ట్రీలో జరుగుతున్న పరిణామాల ప్రభావం కీలక రంగాలపై పడటం ఖాయంగా కనిపిస్తోంది. దక్షిణాదిలో యువత ఎక్కువగా అధిక ఆదాయం ఉన్న వారు సాఫ్ట్ వేర్ ఉద్యోగులే అవుతున్నారు. వారు పెట్టే ఖర్చులు, పెట్టుబడుల కారణంగానే చాలా రంగాల్లో దూకుడు కనిపిస్తోంది.

ఇప్పుడు మెల్లగా సాఫ్ట్ వేర్ రంగంలో మార్పులు వస్తున్నాయి. ఈ క్రమంలో లే ఆఫ్స్ సీజన్ వచ్చేసింది. సాధారణంగా మాంద్యం వల్ల లే ఆఫ్స్ ప్రకటిస్తారు.. కానీ ఇప్పుడు ఏఐ, ఆటోమేషన్ వల్ల తొలగింపులు జరుగుతున్నాయి.మాస్ లే ఆఫ్స్ కారణంగా ఉద్యోగుల్లో ఓ రకమైన భయం నెలకొంది. ఉద్యోగ భద్రత గండంగా మారడంతో దీర్ఘకాలిక పెట్టుబడులపై వారు వెనకడుగు వేసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇళ్ల కొనుగోలు వంటి వాటిపై ఆలోచిస్తారు. ఇప్పటికే ఐటీ కారిడార్ ఉన్న హైదరాబాద్ వెస్ట్ లో రియల్ ఎస్టేట్ పరిస్థితి మెరుగుపడలేదు. మార్కెట్ కు మించి లగ్జరీ ప్రాజెక్టులు నిర్మించేస్తున్నారన్న అభిప్రాయం ఉంది. ఇప్పుడు ఇంకా డిమాండ్ తగ్గనుంది. సాఫ్ట్ వేర్ పరిశ్రమలో ఎంత పెద్దస్థాయిలో ఉన్నా.. సరే కాస్త ఆలోచిద్దామని అనుకునేవారి సంఖ్య పెరుగుతుంది. ఇతర రంగాల వారిపై ఈ లేఆఫ్‌ల ప్రభావం ఎంత ఉంటుందన్నదానిపై అంచనాలు లేవు. అయితే రియల్ ఎస్టేట్ మందగిస్తే ఇతర రంగాల్లోనూ వ్యాపారాలు మందగిస్తాయి. ఇప్పుడు ఆర్థిక వ్యవస్థ అంతా ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటుంది. ఎక్కడ బలహీనమైనా పరిస్థితి తారుమారవుతుంది. అందుకే.. కొంత కాలం ఇబ్బందికర పరిస్థితులు తప్పవన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# అమరావతి అభివృద్ధిలో సింగపూర్ ఈజ్ బ్యాక్



**జయభేరి, విజయవాడ, జూలై 29**

ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రుల బృందం సింగపూర్ పర్యటనలో ఫలితాలు వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిగిన భేటీ పై సింగపూర్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్మెంట్ మంత్రి టాన్ సీ లెంగ్ కీలక ప్రకటన చేశారు. ఏపీ, అమరావతి అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యం కొనసాగుతుందని సింగపూర్ వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి టాన్ సీ లెంగ్ స్పష్టం చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటన సక్సెస్ కావాలని ఆయన ఆకాంక్షించారు. 'భారత్ లో అత్యంత వేగంగా ఎదుగుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. ఏపీలో పెట్టుబడులు, కార్యకలాపాల విస్తరణకు సింగపూర్ కంపెనీలు ఆసక్తిగా ఉన్నాయి. పోర్టులు, గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ టెక్నాలజీ , నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ఏపీలో పెట్టుబడులపై సీఎం చంద్రబాబుతో చర్చించాం. 2014, 2019 సమయంలో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధికి నాటి ఏపీ ప్రభుత్వంతో కలిసి పని చేశాం. అమరావతికి మాస్టర్ ప్లాన్ రూపకల్పన, నిర్మాణ సహకారాన్ని అందించాం. అమరావతిలో స్టార్టప్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు సింగపూర్ కంపెనీలు స్విస్ ఛాలెంజ్ విధానంలో టెండర్లు దక్కించుకున్నాయని' సింగపూర్ మంత్రి టాన్ సీ లెంగ్ గుర్తుచేసుకున్నారు.2019లో ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం మారాక ఒప్పందంలో కొనసాగేందుకు సహకారం ఆగిపోయిందని సింగపూర్ మంత్రి టాన్ సీ లెంగ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అందువల్లే రాజధాని అమరావతి ప్రాజెక్టు నుంచి సింగపూర్ కన్సార్టియం బయటకు వచ్చేసిందని స్పష్టం చేశారు. గత అనుభవాల కారణంగా సీడ్ క్యాపిటల్ విషయంలో సింగపూర్ కన్సార్టియం పని చేయకున్నా.. అమరావతితో పాటు ఏపీలో పట్టణాభివృద్ధి సహా పలు రంగాల్లో అభివృద్ధి ప్లాన్‌లో ఏపీ ప్రభుత్వంతో మరోసారి కలిసి పని చేస్తామని టాన్ సీ లెంగ్ స్పష్టం చేశారు.మానవ వనరులు, సైన్స్ అండ్ టెక్నాలజీ, ట్రేడ్ రంగాల్లో సింగపూర్ భాగస్వామ్యం ఆంధ్రప్రదేశ్‌కు కావాలని మంత్రి టాన్ సీ లెంగ్‌తో భేటీలో చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

గత వైసీపీ ప్రభుత్వం హయాంలో సింగపూర్ కంపెనీలు ఎదుర్కొన్న ఇబ్బందులు పరిష్కరించాలని తాను సింగపూర్ వచ్చినట్లు చెప్పారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా రికార్డులు సరి చేస్తామన్నారు. సింగపూర్ పై ఉన్న అభిమానంతోనే గతంలో హైదరాబాద్ లో సింగపూర్ టౌన్ షిప్ నిర్మించామని గుర్తు చేశారు. హైదరాబాద్ లో రాత్రిపూట రోడ్లను శుభ్రం చేసే కార్యక్రమాన్ని సింగపూర్ ను చూసే చేపట్టినట్లు తెలిపారు. నవంబరు నెలలో విశాఖపట్నంలో జరగనున్న పెట్టుబడుల భాగస్వామ్య సదస్సుకు హాజరు కావాలని టాన్ సీ లాంగ్ ను చంద్రబాబు ఆహ్వానించారు. గృహ నిర్మాణం, సబ్ సీ కేబుల్ రంగాల్లో కలిసి పని చేసేందుకు ఆసక్తి గృహ నిర్మాణం, సబ్ సీ కేబుల్ రంగంలో ఏపీతో కలిసి పని చేసేందుకు సింగపూర్ ఆసక్తిగా ఉంది. ఈ రంగంలో సింగపూర్ ఏపీ కలిసి పని చేస్తాయని సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్ తెలిపారు. గ్రీన్ ఎనర్జీ, గృహనిర్మాణం లాంటి అంశాల్లో ప్రపంచ బ్యాంకు సహకారంతో కలిసి పని చేస్తున్నామన్నారు. గతంలో హైదరాబాద్ వచ్చి చంద్రబాబుతో భేటీ అయ్యానని నాటి సంగతులను సింగపూర్ మంత్రి గుర్తు చేసుకున్నారు.

ఏపీ అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యం విలువైంది: సీఎం చంద్రబాబు సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనలో ఉండగానే ఆ దేశ మానవ నరులు, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి టాన్సీ లెంగ్ కీలక ప్రకటన చేశారు. వివిధ రంగాల్లో ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి సంసిద్ధతను వ్యక్తం చేయడమే కాకుండా.. గత ప్రభుత్వ విధానాలను ప్రస్తావిస్తూ ఎక్స్ వేదికగా సింగపూర్ మంత్రి చేసిన ప్రకటన ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఏపీ, అమరావతి అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యంగా ఉండేందుకు సిద్దంగా ఉందని ఆ దేశ ట్రేడ్ ఇండస్ట్రీ శాఖలోని మానవ వనరులు, శాస్త్రసాంకేతిక మంత్రి టాన్సీ లెంగ్ స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబుతో జరిగిన సమావేశంపై 'ఎక్స్' (ట్విట్టర్) హ్యాండిల్ లో పోస్టు చేసిన ఆయన ఏపీతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించారు. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, పునరుత్పాదక ఇంధనం లాంటి రంగాలు పెట్టుబడులకు అనుకూలమని టాన్సీ లెంగ్ పేర్కొన్నారు. భారత్ లో అత్యంత వేగంగా ఎదుగుతున్న రాష్ట్రాల్లో ఒకటైన ఏపీలో ఫుడ్ ఎంపైర్, ఎవర్ వోల్ట్ లాంటి సింగపూర్ కంపెనీలు ఇప్పటికే పెట్టుబడులు, కార్యకలాపాల విస్తరణకు ఎదురుచూస్తున్నాయని తెలిపారు. అలాగే పోర్టులు, గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో పెట్టుబడులతో పాటు భాగస్వామ్యాలకు ఉన్న అవకాశాలపై సీఎం చంద్రబాబుతో చర్చించినట్టు మంత్రి టాన్సీ లెంగ్ స్పష్టం చేశారు. మరోవైపు 20142019లో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధికి నాటి ప్రభుత్వంతో కలిసి పనిచేశామని గుర్తు చేశారు. మాస్టర్ ప్లాన్ రూపకల్పన, నిర్మాణ సహకారాన్ని అందించినట్టు తన ట్వీట్ లో పేర్కొన్నారు. అమరావతిలో స్టార్టప్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు సింగపూర్ కంపెనీలు స్విస్ ఛాలెంజ్ విధానంలో టెండర్ కూడా దక్కించుకున్నాయని గుర్తు చేశారు. అయితే, 2019లో ప్రభుత్వం మారిన తర్వాత ఈ సహకారం ఆగిపోయిందని అన్నారు. సింగపూర్ కన్సార్టియం కూడా అమరావతి ప్రాజెక్టు నుంచి బయటకు వచ్చేసిందని టాన్సీ లెంగ్ తన పోస్టులో పేర్కొన్నారు. మళ్లీ ఇప్పుడు చంద్రబాబుతో సమావేశమై ఏపీ అభివృద్ధిపై చర్చించినట్టు ఆయన వెల్లడించారు. సీడ్ క్యాపిటల్ విషయంలో సింగపూర్ కన్సార్టియం పనిచేయకున్నా.. ఏపీలో పట్టణాభివృద్ధి సహా వివిధ రంగాల్లో సాంకేతిక సహకారం అందించటంతో పాటు ప్రపంచబ్యాంకు లాంటి భాగస్వాములతో కలిసి ఏపీ అభివృద్ధి ప్రణాళికల్లో కలిసి పనిచేస్తామని టాన్సీ లెంగ్ స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు, మంత్రుల బృందం సింగపూర్ పర్యటన ఫలప్రదం కావాలని కోరుకుంటున్నట్టు సింగపూర్ మంత్రి తన ట్వీట్ లో రాసుకొచ్చారు.వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల్లో ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధమన్న సింగపూర్ మంత్రి టాన్సీ లెంగ్ ప్రకటనకు సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలియచేశారు. ఏపీ ప్రజల తరపున సింగపూర్ ప్రభుత్వానికి, ఆ దేశ మంత్రి టాన్సీ లెంగ్ కు 'ఎక్స్' వేదికగా సీఎం కృతజ్ఞతలు తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను, బిజెపి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- పాపా రావు జిల్లా సంస్థాగత ఎన్నికల ప్రభారీ

**జయభేరి, షాద్ నగర్ :**




కొత్తూరు మండలంలో మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన స్థానిక సంస్థాగత ఎన్నికల కార్యశాల సమావేశానికి ముఖ్య అతిథులుగా స్థానిక సంస్థాగత ఎన్నికల జిల్లా ప్రభారీ పాపా రావు జిల్లా కన్వీనర్ అందెల శ్రీరాములు యాదవ్ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి అందే బాబయ్య పాల్గొని,కార్యకర్తలను దిశానిర్దేశం చేసారు.వారితో పాటు అముడా పురం నర్సింహా గౌడ్,నర్సింహా రెడ్డి,మంగలి రమేష్,మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాపా రావు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలను వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని అన్నారు.అదే విదంగా దేశంలోని అణగారిన వర్గాల అభివృద్ధి కోసం ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాలని స్థానికంగా పార్టీ ని బలోపేతం చేసుకోవాలని సూచించారు.దేశం లో మోడీ ప్రభుత్వం వచ్చిన తరువాత అనేకరంగాలలో భారత్ అభివృద్ధి చెందిందని అదేవిదంగా రైతుల కోసం కేంద్రం అనేక పథకాలు అమల్లోకి తెచ్చిందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రం లో బీఆర్ఎస్ కు స్థానం లేదని కాంగ్రెస్ ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని బిజెపి తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉందని అన్నారు.కాబట్టి అందరూ కలిసి కట్టుగా పని చేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. అదేవిదంగా అందెల శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ స్థానికంగా గ్రామాలలో ఉన్న సమస్యలపై ప్రశ్నించాలని కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించాలని అన్నారు. రైతులను మహిళలను యువతను విద్యార్థులను మోసం చేసిన పార్టీ కాంగ్రెస్ బీఆర్ఎస్ అని అన్నారు. అనంతరం నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి అందే బాబయ్య లు మాట్లాడుతూ.. 70 ఏళ్ళు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను దోచుకున్నదని అదేవిదంగా పదేళ్ళు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రజలను పూర్తిగా మభ్యపెట్టారని అన్నారు. దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత మోడీ నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని అదే విదంగా అణగారిన వర్గాల ప్రజలను బిజెపి అక్కున చేర్చుకుందని అన్నారు. గ్రామాలలో సంపూర్ణ అభివృద్ధి జరగాలంటే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమలో మాణిక్యం, జొల్లు కుమార్, విక్రమ్ రెడ్డి, బావండ్ల మంజుల, మల్లారెడ్డి, వనం శ్రీనివాస్, గొడుగు గణేష్, నర్సింలు,శేఖర్ యాదవ్, హన్మంత్ నాయక్, రాఘవేందర్, విద్య, గోగుల గోపాల్, వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





## హిందూ దేవాలయాలకు రక్షణ లేకుండా పోయింది

**జయభేరి, తుర్కపల్లి, జూలై 29 :**

కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో హిందూ దేవాలయాలకు రక్షణ లేకుండా పోయిందని బిజెపి మండల అధికార ప్రతినిధి కందుకూరి వేణు అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక వర్గానికి కొమ్ముకాస్తూ కేవలం వాళ్ల ఓట్ల బ్యాంకు కోసం హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను పట్టించుకోవడం లేదని అన్నారు. రోడ్లపై ఎన్ని దేవాలయాలు, మసీదులు, చర్చిలు ఉన్నా కానీ బంజారాహిల్స్ పెద్దమ్మ గుడిని కూల్చివేయాల్సిన అవసరం ఏమిటని అన్నారు. కనీసం గుడి యాజమాన్యానికి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అర్ధరాత్రి దేవాలయం కూల్చివేయడం సిగ్గుచేటని అన్నారు. ఫాతిమా కాలేజ్ పూర్తి చెరువులో కబ్జాలో ఉంటే పట్టించుకోరని అన్నారు. హిందూ మనోభావాలను దెబ్బతీసేలా చేస్తున్నారని, తక్షణమే దేవాలయాన్ని కూల్చిన అధికారులను సస్పెండ్ చేయాలని లేని పక్షంలో హిందువులంతా ఏకమై తగిన బుద్ధి చెప్తారని అన్నారు.

## ఫామ్ ఆయిల్ పంటతో ఆర్థిక బలం

**జయభేరి, వికారాబాద్ :**

పామ్ ఆయిల్ పంటలు సాగు చేస్తూ అధిక దిగుబడులతో ఆర్థికంగా బలపడాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు రైతులకు సూచించారు. వికారాబాద్ పరిసర ప్రాంతంలోని కొత్రేపల్లిలోని కాసాని జ్ఞానేశ్వర్ వ్యవసాయ క్షేత్రంలో చేపట్టిన మెగా ఆయిల్ ఫామ్ ప్లాన్ టేషన్ డ్రైవ్ లో భాగంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వరావు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి రైతులను ఆదుకునే దిశగా పనిచేస్తుందన్నారు. పామ్ ఆయిల్ పంట సాగుతో అధిక లాభాలు ఆర్జించడంతో పాటు మూడు సంవత్సరాల పాటు అంతర్గత కూరగాయ పంటలతో వ్యవసాయం సాగు చేయవచ్చునని మంత్రి తెలిపారు. ఆయిల్ ఫామ్ పంటకు ప్రభుత్వం సబ్సిడీని అందిస్తూ రైతులను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యధికంగా ప్రాముఖ్యత నిస్తూ రైతుల సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన ఏడాదిన్నర లోనే వ్యవసాయ రంగం కోసం లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసిందని, రైతులను రుణ బారం నుండి విముక్తులను చేయడానికి 25 లక్షల మంది రైతులకు చెందిన 21 వేల కోట్ల రుణాలను మాఫీ చేయడం జరిగిందని సభాపతి తెలిపారు. రైతు భరోసా ను ఏడాదికి ఎకరాకు 12 వేలకు పెంచి కేవలం తొమ్మిది రోజులలో తొమ్మిది వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాలలో వేయడం జరిగిందని ఆయన అన్నారు. రైతు బీమా, సన్న రకాల వడ్లకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్, వ్యవసాయ రంగానికి ఉచితంగా విద్యుత్తు సరఫరా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమల శాఖ డైరెక్టర్ యాస్మీన్ భాష, డిప్యూటీ డైరెక్టర్ నీరజ గాంధీ , జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి సత్తార్, వ్యవసాయ శాఖ అధికారి రాజా రత్నం, ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లు, అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# క్యా కమాల్ హై?
## బిల్డ్‌నౌతో ప్రయోజనం ఏమిటి?

- మూడు చింతలపల్లిలో ఇదో దందా?
- ఎవరి వాటా ఎంత? తేలేది ఎలా?

**జయభేరి, శామీర్ పేట్, జూలై 29 :**



ప్రభుత్వాలు మారుతున్నాయి. అయినా ఎంపియూడీలో అవినీతి, అక్రమాలు మారడం లేదు. పైపెచ్చు పెరిగిపోతున్నాయి. ఎన్ని వ్యవహారాలు వెలుగులోకి వస్తున్నా... వాటిపై చర్యలు తూతూ మంత్రంగానే ఉంటున్నాయి. ఈ క్రమంలోనే మేడ్చల్ జిల్లాలోని మూడు చింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చే కేశవరంలో సర్వే నెం: 302లో రూపొందించిన లేఅవుట్ వ్యవహారం విమర్శలకు తావిస్తున్నది. కేశవరంలోని సర్వే నెం: 302లో రూపొందించిన లేఔట్ స్థలం పూర్తిగా అగ్రికల్చర్ స్థలంగానే ప్రస్తుతం భూ భారతిలో చూపిస్తున్నది. ఓ పక్క రైతుబంధు పొందుతూనే.. మరోపక్క నాలా కన్వెన్షన్ లేకుండా నిర్మాణాలు చేస్తుంటే మున్సిపల్ అధికారులు ఉన్నారా? లేరా? అనేది స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. మున్సిపాలిటీ పరిధిలో ఏం జరుగుతోంది? అనేది అందోళనకలిగిస్తోంది. ఈ క్రమంలోనే అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ రజనీకాంత్‌గౌడ్ అనే స్థానిక వ్యక్తి మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, రెవెన్యూ, మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రెటరీలకు ఫిర్యాదు చేయడంతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కాగా ఈ విషయంపై మూడు చింతలపల్లి మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. స్పందించలేదు. ప్రజలు చెల్లించే పన్నులను ప్రభుత్వ అధికారులు జీతం రూపేణా పొందుతూ... ప్రభుత్వం చెల్లించే బిల్లులతో సెల్ ఫోన్ వినియోగించుకునే అధికారులు ప్రజలు ఫోన్ చేస్తే కూడా స్పందించడం లేదంటే? ఎవరు ప్రశ్నించాలి? ఇకనైనా మేడ్చల్ జిల్లా కలెక్టర్ స్పందించి కేశవపురంలోని సర్వే నెం: 302లో రూపొందుతున్న అక్రమ లేఅవుట్‌కు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.



## విద్యార్థులు మత్తు పదార్ధాలకు దూరంగా ఉండాలి ఎస్సై అజ్మీరా రమేష్

**జయభేరి, కొండ మల్లేపల్లి :**



కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని క్రాంతి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తు వల్ల కలిగే అనర్థాలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు కార్యక్రమంలో మల్లెపల్లి ఎస్సై అజ్మీర రమేష్. ఎస్సై రమేష్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు మనుషులపై తీవ్ర ప్రభావం చూపుతాయని, వాటికి బానిసలు కాకుండా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు గురికావద్దని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఉన్నత భవిష్యత్తు కోసం అహర్నిషలు శ్రమిస్తూ కళాశాలలకు పంపిస్తున్నారు , వారి కలలను సాకారం చేయాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందన్నారు. తెలిసీ తెలియని వయస్సులో ప్రేమలో పడి కన్న తల్లిదండ్రులను మోసం చేయరాదని గుర్తు చేశారు. మాదక ద్రవ్యాలు విక్రయించేవారు చిన్నపిల్లలను టార్గెట్ చేస్తారని అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అపరిచిత వ్యక్తులతో మాట్లాడవద్దని, చాక్లెట్లు, స్టిక్కర్ల రూపంలో మత్తు పదార్థాలు ఉండవచ్చని, జాగ్రత్తగా ఉండాల ని సూచించారు. ద్విచక్ర వాహనాలపై లిఫ్ట్ ఇస్తామంటే వెళ్లకూడదని తెలిపారు.సమావేశంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ దుండిగళ్ళ అశోక్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గుంటోజు ఆంజనేయులు, ఏవో యర్రమాద గోవర్ధన్ రెడ్డి, పోలీసు సిబ్బంది ప్రవీణ్, సంతోష్ రెడ్డి, శేఖర్, రమేష్, కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.






## ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తి చేసుకోవాలి

**జయభేరి, తుర్కపల్లి, జూలై 29 :**

ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో లెంకల గీతారెడ్డి అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో 141 ఇండ్లకు గాను 70 ఏళ్లు పనులు నడుస్తున్నట్లు తెలిపారు. మిగతావారు కూడా త్వరలో ముగ్గు పోసుకొని ఇండ్ల పనులను ప్రారంభించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఈ శ్రీరాములు, ఎంపీ ఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ నరేష్, జూనియర్ అసిస్టెంట్ సంతోష్, పంచాయతీ కార్యదర్శి ఒగ్గు మధు, కరోబార్ పలుగుల ప్రశాంతి ,ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపాల్ గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ సుంకర రమేష్



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపాల్ గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ సుంకర రమేష్ ను ఎం కె ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల దేవరకొండ ప్రిన్సిపాల్ డాక్టర్ రమావత్ రవి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎం కె ఆర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి. కోటయ్య, అకాడమీ కోఆర్డినేటర్ సి.హెచ్. లింగమయ్య, సి.హెచ్. లింగారెడ్డి TSKC మెంటర్ శివకృష్ణ, జూనియర్ కళాశాల అధ్యాపకులు సాయిలు, నరసింహ, రాజు తదితర అధ్యాపక అధ్యాపకేతర బృందం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నాగుల పంచమి వేడుకలు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం ఆవరణలో నాగుల పంచమి వేడుకలు వైభవంగా నిర్వహించిన మహిళా భక్తులు ఈసారి నాగుల పంచమి మంగళవారంతో సుబ్రహ్మణ్య స్వామికి ప్రీతికరమైన రోజు, శుక్ల పంచమి రెండు కలిసి రావడంతో మహిళలు పెద్ద ఎత్తున పుట్ట దగ్గర పూజలు నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో సముద్రాల సత్య, బండారు పుష్ప, వాస గిరిజ, పందిరి కళావతి, జూలూరు జ్యోతి, బండారు ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సిఐని మర్యాదపూర్వకంగా కలిసిన వాడబలిజ సేవా సంఘం నాయకులు




**జయభేరి, వెంకటాపురం :**

వెంకటాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ముత్యం రమేష్ ను తెలంగాణ రాష్ట్ర వాడ బలిజ సేవా సంఘం నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ వాడ బలిజ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు దర్ర దామోదర్, అధికార ప్రతినిధి తోట మల్లికార్జునరావు, ఉపాధ్యక్షులు గగ్గూరి రమణయ్య, రాష్ట్ర నాయకులు అల్లి సూరిబాబు,సీనియర్ నాయకులు అల్లి నాగేశ్వరరావుయువ నాయకులు కొక్కురు ముత్యాలరావు, ములుగు జిల్లా ఉపాధ్యక్షులు గగ్గూరి రమేష్, వెంకటాపురం మండల అధ్యక్షులు బొల్లె సునీల్, వాజేడు మండల అధ్యక్షులు గార నాగార్జున,వాజేడు మండల అధికార ప్రతినిధి బొల్లె ఆదినారాయణ నాయకులు ఎర్రాల కన్నయ్య,దర్ర గోపి,తోట సతీష్,కొప్పుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## 15,116 వడలతో స్వామికి అలంకరణ

**జయభేరి, హైదరాబాద్:**

శ్రావణ మాసం తొలి మంగళవారం సందర్భంగా బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని నందినగర్ శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగుల పంచమితో పాటు ఉత్తరా నక్షత్రం పంచమి తిథి సందర్భంగా స్వామివారికి 15,116 వడలతో వడమాలలను వేశారు. ఆలయ అర్చకులు శశికుమారాచార్యులు మాట్లాడుతూ శ్రావణ మాసం అంటే స్వామివారికి ఎంతో ప్రీతికరమైనదని ఆయనను శ్రావణ మాసంలో ఆరాధిస్తే ఎంతో మంచి జరుగుతుందనేది భక్తుల విశ్వాసమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కిరణ్ కుమారాచార్యులు, ఆలయ చైర్మన్ దశరథ చౌహాన్, రత్నాకర్, ఫణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# ధార్మిక కార్యక్రమాలు మానసిక ప్రశాంతతను కలిగిస్తాయి

■ శ్రీశ్రీశ్రీ గోదాదేవి సమేత మన్నార్ రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్ సింగ్



✍ జయభేరి, ఘట్కేసర్ :

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఏదులాబాద్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ గోదాదేవి సమేత రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరిగాయి. మాజీ ఎంపీటీసీ కందుల కుమార్ గారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిథులుగా మాజీ శాసనసభ్యులు మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ జడ్పీ ఛైర్మెన్ మల్లిపెద్ది శరత్ చంద్ర రెడ్డి, పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్ సింగ్, ముల్లి పావని జగ్గయ్య యాదవ్, బి బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, ఘట్కేసర్ మున్సిపాలిటీ అధ్యక్షులు మామిడ్ల ముత్యాలు యాదవ్, మాజీ కార్పొరేటర్ భీమ్ రెడ్డి నవీన్ రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. వీరంతా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
మాజీ శాసనసభ్యులు మల్లిపెద్ది సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ఏదులాబాద్ గ్రామంలో శ్రీ రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు ప్రతి ఏటా అత్యంత వైభవంగా నిర్వహించడం ఒక గొప్ప సంప్రదాయమని, ఈ ఉత్సవాలు గ్రామస్తులందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి, సామరస్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు.
పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్ సింగ్ మాట్లాడుతూ, ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో స్వామివారిని దర్శించుకోవాలని, స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు. ధార్మిక కార్యక్రమాలు మానసిక ప్రశాంతతను కలిగిస్తాయని, సమాజంలో సోదరభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. కందుల కుమార్ ఇలాంటి కార్యక్రమం నిర్వహించినందుకు ఆయనను అభినందించారు. ఈ ఉత్సవాలకు గ్రామస్తులే కాకుండా, పరిసర ప్రాంతాల నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారిని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. రంగురంగుల పూలతో అలంకరించిన రథంపై స్వామివారు కనువిందు చేశారు. భక్తులు స్వామివారికి హారతులు సమర్పించి, పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

## బస్సులో దొరికిన విలువైన మొబైల్ ఫోన్ ను బాధితురాలికి అందజేత



✍ జయభేరి, దేవరకొండ :

దేవరకొండ ఆర్టీసీ డిపోకు చెందిన ప్రైవేట్ బస్ డ్రైవర్ M. శ్రీను మరియు కండక్టర్ సాయిబాబా బస్సులో దొరికిన విలువైన మొబైల్ ఫోన్ ను బాధితురాలికి అప్పగించి నిజాయితీ చాటుకున్నారు. మల్లేపల్లి నుండి దేవరకొండ దేవరకొండకి వస్తున్న బస్సులో చెందిన మహబూబి తన మొబైల్ ని పోగొట్టుకున్నాడు. డ్రైవర్ M. శ్రీను, గమనించి భద్రంగా డిపోలో బాధితురాలి బంధువుకి అప్పగించారు. ఈ సందర్భంగా బాధితుడు ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. నిజాయితీగా విధులు నిర్వహించిన సిబ్బందికి డిపో అధికారులు అభినందనలు తెలిపారు.

## జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల యూత్ జాయింట్ సెక్రటరీగా బీమగోని శివ కుమార్



✍ జయభేరి, దేవరకొండ :

మండల జాతీయ బీసీ సంక్షేమ సంఘం యూత్ జాయింట్ సెక్రటరీగా బీమగోని శివ కుమార్ ను సామజిక వేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మంగళవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. నూతనంగా ఎన్నికైన సందర్భంగా అయన మాట్లాడుతు తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు.అన్ని గ్రామాల్లో బీసీ కమిటీ నిర్మాణం, బీసీ సమస్యలపై, బీసీలను చైతన్యం చేస్తూ, 42 శాతం రిజర్వేషన్ పై ప్రభుత్వ మొండి వైఖరిని అందరికి వివరిస్తూ బీసీ ల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చోళ్ళేటి భాస్కర చారి, వరికుప్పల శ్రీను ఆర్మీ, పున్న వెంకటేష్ నేత,అప్పం వీరయ్య, గండూరి లక్ష్మణ్, రెడ్డి కోటేశ్వరరావు, ఏటెల్లి శ్రీశేలం యాదవ్,దుడ్డు దశరథం, శివ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జోనల్ కమిషనర్ ను కలిసిన ఎమ్మెల్యే, కార్పొరేటర్



✍ జయభేరి, ఉప్పల్ :

నాచారం డివిజన్ సమస్యలపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ని కలిసిన నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్. నాచారం డివిజన్లోని పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు విషయమై చర్చించడం జరిగింది. నూతన వార్డు కార్యాలయానికి లిఫ్ట్ ఏర్పాటు. హిందూ స్మశాన వాటికను వైకుంఠధామముగా తీర్చిదిద్దుట, రైతు బజార్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణము, VST కాలనీకి మంజూరైన 20 లక్షల రూపాయల సిమెంటు రోడ్డు పనులు తిరిగి రీవాల్యుయేషన్ చేయాలని, బాబా నగర్ లోని రెడ్డి స్మశాన వాటికలో అభివృద్ధి పనుల విషయమై, పటేల్ కుంట చెరువు సుందరీ కరణ మరియు అభివృద్ధి కొరకు నిధులు మంజూరు చేయవలసిందిగా కోరడం జరిగింది. అన్ని అభివృద్ధి పనులకు జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి హామీ ఇవ్వడం జరిగింది.

## పనులను పూర్తి చేయిస్తాను అని హామీ

■ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



✍ జయభేరి, ఉప్పల్ :

రామంతపూర్ భగయత్ వెంకట సాయి నగర్ కాలనీ బీరప్ప దేవాలయం వెనకాల లైన్ లో సాంక్షన్ అయినటువంటి బాక్స్ కల్వర్ట్ ను అధికారులను తప్పుదోవ పట్టించి సాంక్షన్ అయినటువంటి బాక్స్ కల్వర్టును వెయ్యకుండా అడ్డుకుంటున్నారని వెంకట సాయి నగర్ కాలనీవాసులు ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసారు. ఈ మేరకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఎవరు అభివృద్ధిని అడ్డుకుంటే వారిపైనా న్యాయ పరమైన చర్యలు చేపడతామని అన్నారు. ఇప్పటికే రామంతపూర్ భగయత్ కాలనీలకు కోటి రూపాయలు మంజూరు చేయించి డ్రైనేజీ లైన్లు పూర్తి చేయించామని శాంక్షన్ అయినటువంటి బాక్స్ కల్వర్టు కూడా త్వరలో శంకుస్థాపన చేసి పనులను పూర్తి చేయిస్తాను అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ నాయకులు గంధం నాగేశ్వరరావు, సర్వ సత్తయ్య యాదవ్, గోపాల్, ఆర్ .గోవింద్, ఏ విజయేందర్ రెడ్డి, శంకర్, శ్రీనివాస్ గౌడ్, అశోక్, నవీన్, కీర్తి, చారి, సయ్యద్, చారి తదితరులు పాల్గొన్నారు.

# వెంకటాపురం – చర్ల రహదారికి త్వరలో మోక్షం

■ రెండు వారాల్లో మరమ్మత్తులు ప్రారంభం
■ బలహీన పడిన వంతెనలు పరిశీలన

✍ జయభేరి, వెంకటాపురం, జూలై 29 :



ములుగు జిల్లా శాఖ వెంకటాపురంచర్ల ప్రధాన రహదారిపై మరమ్మత్తు పనులు రెండు వారాల్లో ప్రారంభమవనున్నట్లు రోడ్లుభవనాల సూపరింటెండింగ్ ఇంజనీర్ రాఘవరెడ్డి తెలిపారు. మంగళవారం వెంకటాపురం అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడిన ఆయన, రహదారి రీకన్స్ట్రక్షన్ కోసం రూ.44 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ప్రభుత్వ, సాంకేతిక మంజూరులు లభించగానే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. ఇప్పటికే గోతుల భర్తీకి రూ.2 కోట్లు మంజూరయ్యా యని, టెండర్ ప్రక్రియ పూర్తయ్యాక రెండు వారాల్లో మరమ్మత్తులు మొదలవుతాయని తెలిపారు. వీరభద్రారం వద్ద కుక్కమాకు వంతెనపై హెవీ వాహనాలు, ఇసుక లారీల వల్ల వైబ్రేషన్ పెరిగిందని, ఆ వంతెనను పూర్తిగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రీయ రహదారి నెం.12పై 40 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెనలను తరచూ తనిఖీ చేస్తామని పేర్కొన్నారు. వెంకటాపురంభద్రాచలం రహదారిలో గోతులు అధికమవడం వల్ల గత 45 రోజులుగా బస్సు సౌకర్యం నిలిచిపోయిందని, ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, ఈ విషయాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిడెం మోహన్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిడెం సాంబశివరావు, బాలసాని వేణుతో పాటు ఇతరులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. రహదారి తనిఖీ కోసం ఎస్.ఇ. రాఘవరెడ్డి, ఈఈ సాంసింగ్, డీఈ వెంకటరమణ విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

## డివిజన్లో ఉదయం పర్యటించిన జిహెచ్ఎంసి కమిషనర్

✍ జయభేరి, ఎల్బీనగర్ :



వనస్థలిపురం డివిజన్లో ఉదయం పర్యటించిన జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్. వి.కర్ణం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ పటేల్. వనస్థలిపురం వాసులకు అందుబాటులోకి వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి కోరిక మేరకు ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మధు యాష్కి గౌడ్ సహకారంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెరువుతో అతి త్వరలోనే వనస్థలిపురంలో ఓపెన్ ఆడిటోరియం లోని కొంత భాగంగా మినీ ఆడిటోరియం భవన నిర్మాణ పరిశీలనకు మంగళవారం జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణం మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వనస్థలిపురంలో అత్య ఆధునికమైన ఆడిటోరియం భవనాన్ని నిర్మాణం చేయటానికి నిధులు మంజూరు చేయనున్నట్లు. ఇందులో భాగంగానే పరిశీలనకు విచ్చేసినట్లు తెలిపారు. అతి త్వరలోనే వనస్థలిపురం వాసులకు మినీ ఆడిటోరియం భవనం నిర్మాణం అందుబాటులోకి వస్తుందని. ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. మినీ ఆడిటోరియం భావన నిర్మాణం అధిక నిధులు కేటాయించాలని ఆధునికమైన భవనం నిర్మాణం చేపట్టాలని ఆయన ఉన్నత అధికారులను కోరారు. అనంతరం కార్పొరేటర్ జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ తో పలు కాలనీలో సమస్యలపై పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ సర్కిల్ ఫోర్ డిప్యూటీ కమిషనర్ మల్లికార్జున రావు, జిహెచ్ఎంసి అశోక్ రెడ్డి, సర్కిల్ ఫోర్ ఏసిపి ప్రతాపు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎండి రఫీ, ఎంహెచ్ఓ, సర్కిల్ 4 ఏఈ విగ్నేశ్వరి, ఏ యు బీడీ. శ్రీనివాస్, ఏఈ మణి, క్రిస్టియన్ కాలనీ ప్రెసిడెంట్ హరేందర్ రెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

■ గౌడవల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన..

✍ జయభేరి, మేడ్చల్ :



అర్హులైన నిరుపేదలందరికి ప్రభుత్వం దశలవారీగా ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేస్తుందని గౌడవల్లి మాజీ సర్పంచ్ గరిసెల సురేందర్ ముదిరాజ్ అన్నారు.
మంగళవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గౌడవల్లి గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పనులను మున్సిపల్ హౌసింగ్ ఏఈ కమలాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే నిరుపేదల ఆకలి తీర్చేందుకు ఉచిత రేషన్ ను ఇస్తూనే కొత్త రేషన్ కార్డులను అందజేసిస్తుందని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్లు ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, రైతులకు రుణమాఫీ, నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్లు వంటి అభివృద్ధి పనులు చేస్తూ అందరికి ఆదర్శనంగా పాలన సాగుతుందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో మేడ్చల్ మండల పార్టీ అధ్యక్షుడు గోమారం రమణారెడ్డి, నాయకులు భగవాన్ దాస్, గోపాల్, మురళి గౌడ్, రఘుపతి రెడ్డి, హరిశంకర్, సంధ్య, సురేష్, శారదా, శంకర్ యదవ్ తదితరులు పాల్గొన్నారు.



## కేటీఆర్ కు మంత్రి సీతక్క సవాల్

✍ జయభేరి, హైదరాబాద్:

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కి మంత్రి సీతక్క సవాల్ విసిరారు. బిజెపి ఎంపీ సీఎం రమేష్ చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు. సీఎం రమేష్ ఇంటికి వెళ్ళలేదు, బిజెపితో కుమ్మక్కు కాలేదు అని ఎందుకు క్లారిటీ ఇవ్వడం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో మీ పార్టీకి, మా పార్టీకి ఒక శాతం ఓట్ల తేడా మాత్రమే అని కేటీఆర్ అన్నారు. మరి లోక్ సభ ఎన్నికల్లో మీరు మీ పార్టీ ఓట్లు బిజెపికి వేయించింది నిజమా..?కాదా అని నిలదీసారు. ఈ ప్రశ్నలకు కేటీఆర్ గుండెపై చేయి వేసుకుని సమాధానం చెప్పాలి. కేటీఆర్ అబద్ధాలు మాట్లాడుతారనేది ఎంపీ రమేష్ మాటల్లో చూశాం. ఎన్ని అబద్ధాలు చెప్పిన కొద్దీ రోజుల్లో నిజం తెలుస్తుందని అన్నారు.

## గ్రీన్ హెరిటేజ్ లో భాగంగా రావి చెట్టు కు పునర్జన్మ

✍ జయభేరి, సికింద్రాబాద్ :

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ గేట్ వద్ద ఉన్న పెద్ద రావి చెట్టు రైల్వే అభివృద్ధి పనుల దృష్ట్యా దెబ్బతినే అవకాశం ఉండటంతో, సంబంధిత అధికారుల అనుమతులతో, రైల్వే అధికారుల సహకారంతో, ట్రాఫిక్ 1, నార్త్ జోన్ సిబ్బంది చొరవతో అదే ప్రాంతంలోని మహబూబ్ కాలేజ్, సికింద్రాబాద్లోకి విజయవంతంగా మార్చివేయబడింది. ఈ చర్య ద్వారా నగరంలోని పచ్చదనాన్ని కాపాడడంలో, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిచ్చినట్లు ట్రాఫిక్ శాఖ నిరూపించుకుంది. భవిష్యత్తులో కూడా చెట్టు పునర్వృద్ధిని నిరంతరం పర్యవేక్షిస్తూ గ్రీన్ హెరిటేజ్ను రక్షించేందుకు కృషి కొనసాగిస్తామని నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ జీ శంకర్ రాజు తెలిపారు.

## గుర్తు తెలియని మహిళ



✍ జయభేరి, ఉప్పల్ :

ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని ఉప్పల్ పోలీసులు గుర్తించారు. ఆమె వయసు సుమారు 50, 55 సంవత్సరాలు. ఈ ఘటన ఆదివారం తేదీ 27 నా జరుగగా.. ఆమె మృతదేహాన్ని గాంధీ హాస్పిటల్ కు తరలించారు. మహిళను గుర్తుపట్టిన వారు ఉంటే సంప్రదించగలరు.

ప్రభాత
జయభేరి
సినిమా
05
30-07-2025
బుధవారం
jayabheridaily.com



## ప్రజలకి బాలయ్య హెచ్చరిక.. నా ఆసుపత్రి పేరుతో మోసం..

సెలబ్రిటీల పేరును దుర్వినియోగం చేస్తూ మోసాలు చేయడం కొత్త కాదు. తాజాగా నందమూరి బాలకృష్ణ కూడా ఇలాంటి మోసం బారినపడ్డారు. బాలయ్య డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ పేరుతో ఒక వ్యక్తి ప్రజల నుండి విరాళాలు వసూలు చేస్తున్న ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ విషయం బాలయ్యకు తెలిసిన వెంటనే ఆయన స్పందించారు. ప్రజలను అప్రమత్తం చేస్తూ ఫేస్‌బుక్ ద్వారా స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు. "బంగారు బాలయ్య - బసవతారకం ఈవెంట్" పేరిట అశ్విన్ అట్లూరి అనే వ్యక్తి నా పేరు, బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ పేరును అనుమతిలేకుండా ఉపయోగిస్తూ ఈ కార్యక్రమాన్ని విరాళాల సేకరణ కోసం నిర్వహిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఈ సందర్భంగా ప్రజలందరికి నేను స్పష్టంగా తెలియజేయదలచుకున్న విషయం ఏంటంటే.. ఈ ఈవెంట్‌కు నా అనుమతి లేదు. హాస్పిటల్ ట్రస్ట్ బోర్డు తరఫున ఎటువంటి అధికారిక ఆమోదం లేదు. కాబట్టి నా విజ్ఞప్తి ఏంటంటే.. దయచేసి ఈ రకమైన అనధికారిక, తప్పుదారి పట్టించే కార్యక్రమాల పట్ల అప్రమత్తంగా ఉండండి.బసవతారకం హాస్పిటల్ తరఫున జరిగే అన్ని అధికారిక కార్యక్రమాలు, విరాళాల అభ్యర్థనలు కేవలం ధృవీకరించబడిన, పారదర్శకమైన మాధ్యమాల ద్వారానే నిర్వహించబడతాయి. మోసపూరిత ప్రకటనలు, కార్యక్రమాలను నమ్మి మోసపోవద్దు అని బాలయ్య తన ఫేస్ బుక్ పోస్ట్‌లో తెలియజేశారు. ఇక సినిమాల విషయానికి వస్తే బాలకృష్ణ ప్రస్తుతం తన కొత్త చిత్రంతో బిజీగా ఉన్నారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'అఖండ 2' షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా సాగుతోంది. ఇందులో ఆదిపినిశెట్టి విలన్‌గా నటిస్తుండగా, ఇటీవల విడుదలైన టీజర్ మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది. మొదటగా సెప్టెంబర్ 25న విడుదల చేయాలని నిర్ణయించినా, తాజా సమాచారం ప్రకారం విడుదల తేదీలో మార్పు ఉండొచ్చని టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాతో బాలయ్య మరో పెద్ద హిట్ కొట్టడం ఖాయం అంటున్నారు.

## అమీర్‌ఖాన్ టాకీస్ జనతా కా థియేటర్..



అగ్ర హీరో అమీర్‌ఖాన్ అన్నంత పని చేశారు. 'సితారే జమీన్ పర్' చిత్రాన్ని తన సొంత యూట్యూబ్ ఛానల్‌లో అందుబాటులోకి తీసుకొస్తున్నారు. అమీర్‌ఖాన్, జెనీలియా డిసౌజా కీలక పాత్రల్లో నటించిన 'సితారే జమీన్ పర్' చిత్రం గత నెల 20న ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ చిత్రానికి సంబంధించిన డిజిటల్ హక్కులను ఏ ఓటీటీ సంస్థకు ఇవ్వనని, యూట్యూబ్‌లో పే పర్ వ్యూ విధానంలో తానే విడుదల చేస్తానని సినిమా రిలీజ్‌కు ముందు అమీర్‌ఖాన్ ప్రకటించిన విషయం తెలిసిందే. అమీర్‌ఖాన్ నిర్ణయం పలు ఓటీటీ సంస్థలను డిఫెన్స్‌లో పడేసింది. ఇదే విధానాన్ని అందరూ ఫాలో అయితే ఓటీటీ బిజినెస్ ప్రమాదంలో పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో అమీర్‌ఖాన్ తన చిత్రాన్ని ఆగస్ట్ 1నుంచి యూట్యూబ్‌లో స్ట్రీమింగ్‌కు తీసుకొస్తున్నారు. ఇందుకోసం ఆయన 'అమీర్‌ఖాన్ టాకీస్‌జనతా కా థియేటర్' పేరుతో సొంత యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించారు. పే పర్ వ్యూ విధానంలో 100 రూపాయలకు ఈ చిత్రాన్ని వీక్షించవొచ్చని ఆయన తెలిపారు. సినిమాల విషయంలో థియేట్రికల్ రిలీజ్‌కు తాను తొలి ప్రాధాన్యతనిస్తానని, థియేట్రికల్ రన్ పూర్తయిన తర్వాతే యూట్యూబ్‌లో స్ట్రీమింగ్ తేవాలన్నది తన అభిమతమని, ఈ విధానం అటు నిర్మాతలకు, ఇటు ప్రేక్షకులకు లాభదాయకంగా ఉంటుందని అమీర్‌ఖాన్ మీడియా సమావేశంలో పేర్కొన్నారు.



## శ్రీదేవిని గుర్తు చేస్తోంది..

అతిలోక సుందరి గారాలపట్టీగా తెలుగు ఆడియన్స్ ఫేవరెట్ బ్యూటీ అయిపోయింది. ఇక దేవర సినిమాలో ఈ అమ్మడు గ్లామర్‌కు, నటనకు మంచి మార్కులు పడ్డాయి. దీంతో ఈ బ్యూటీకి తెలుగులో వరసగా అవకాశాలు వస్తున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ బ్యూటీ ప్రసుత్తం తెలుగులో బుచ్చిబాబు దర్శకత్వం లోని స్టార్ హీరో రామచరణ్‌తో పెద్ది సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాతో ఈ ముద్దుగుమ్మ టాలీవుడ్‌లో మరింత పాపులారిటీ సొంతం చేసుకోవడం ఖాయం అంటున్నారు ఫ్యాన్స్. ఇక ఈ ముద్దుగుమ్మ సినిమాలే కాకుండా అప్పుడప్పుడు ఫ్యాషన్ షోలతో కూడా అభిమానులను అలరిస్తూ ఆకట్టుకుంటుంది. తాజాగా ప్రత్యేకంగా డిజైన్ చేసిన ఒక ఔట్ఫిట్‌లో తళ్లుక్కుమిం చిన మరో దేవకన్యలా కనిపిస్తుంది. ప్రస్తుతం జాన్వీ ఈ లుక్ ప్రతి ఒక్కరినీ ఆకర్షిస్తుంది. ప్రత్యేకంగా డిజైన్ చేసిన ఔట్ఫిట్‌లో అచ్చం దేవకన్యలా కనిపిస్తూ.. తన తల్లి శ్రీదేవిని గుర్తు చేస్తోందంటున్నారు అభిమానులు. అంతే కాకుండా ఈ లుక్‌లో జాన్వీ అందాలను అలా చూస్తు ఉండిపోవచ్చు అని కామెంట్స్ చేస్తున్నారు ఈ బ్యూటీ ఫ్యాన్స్. ప్రస్తుతం ఈ ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. వీటిని చూసిన వారందరూ బ్యూటిఫుల్.. చాలా క్యూట్ గా ఉన్నావంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరి మీరు కూడా ఆఫొటోస్ చూసేయ్యండి.

## రూ.30 కోట్లతో తీస్తే 404 కోట్ల కలెక్షన్లు..

ప్రస్తుతం సినిమాల్లో పాన్ ఇండియా ట్రెండ్ కొనసాగుతోంది. టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్, శాండల్ వుడ్.. ఇలా అన్ని సినిమా ఇండస్ట్రీల్లోనూ ఈ భారీ సినిమాలకే ఓటు వేస్తున్నాయి. వీఎఫ్ఎక్స్ హంగులు, అబ్బురపరిచే యాక్షన్ సీక్వెన్సుల అంటూ కోట్ల రూపాయలు కుమ్మరిస్తున్నాయి. అయితే వీటిలోనూ కొన్ని సినిమాలు మాత్రమే సక్సెస్ అవుతున్నాయి. మరికొన్ని మూవీస్ బాక్సాఫీస్ వద్ద బోల్తా పడుతున్నాయి. ఫలితంగా నిర్మాతలకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లుతోంది. ఇలాంటి ట్రెండ్‌లో ఒక చిన్న సినిమా అద్భుతాలు చేస్తోంది. ఇందులో స్టార్ హీరో, హీరోయిన్స్ లేరు. బడ్జెట్ కూడా పెద్దగా పెట్టలేదు. వీఎఫ్ఎక్స్, స్పెషల్ సాంగులు, యాక్షన్ సీక్వెన్సులు గట్రా ఏమీ లేవు. ప్రమోషన్స్ కూడా చేయలేదు. అసలు ఈ సినిమా రిలీజ్ గురించే చాలామందికి తెలియదు. కానీ ఇప్పుడు ఈ చిన్న సినిమా బాక్సాఫీస్‌ను షేక్ చేస్తోంది. రోజూ కోట్లాది రూపాయలను కలెక్ట్ చేస్తూ నిర్మాతలకు కాసుల వర్షం కురిపిస్తోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ఈ మూవీ పేరే వినిపిస్తోంది. నేషనల్ మీడియాలోనూ ఈ సినిమాకు సంబంధించిన వార్తలే కనిపిస్తున్నాయి. పాన్ ఇండియా ట్రెండ్ అంటూ ప్రస్తుతం సినిమాల్లో భారీ తనానికే పెద్ద పీటవేస్తున్న పరిస్థితుల్లోనూ కంటెంటే కింగ్ అని మరోసారి నిరూపించిన ఆ సినిమా పేరు సైయారా. మోహిత్ సూరి తెరకెక్కించిన ఈ ఎమోషనల్ లవ్ స్టోరీలో అహాన్ పాండే (అనన్యా పాండే సోదరుడు), అనీత్ పడ్డా హీరో, హీరోయిన్లుగా నటించారు. వీరిద్దరికీ ఇదే మొదటి సినిమా కావడం గమనార్హం. ఈ సినిమా కథ కూడా సింపుల్‌గా ఉంటుంది. హీరో, హీరోయిన్ ప్రేమలో పడతారు. కొన్ని సంఘటనల కారణంగా హీరోయిన్ గతం మర్చిపోతుంది. కొత్తగా ఇంకొకరిని ప్రేమించడంతో కథ లో ట్విస్ట్ ఆసక్తి రేపుతుంది. మరి ఆ తర్వాత ఏమైంది? హీరో, హీరోయిన్లు కలిశారా? అన్నదే ఈ సినిమా కథ. గతంలో ఇదే కథతో చాలా సినిమాలు వచ్చాయి. కానీ ఆషికీ 2 వంటి ఎమోషనల్ లవ్ స్టోరీలు తీసిన డైరెక్టర్ మోహిత్ సూరి తన ప్రజెంటేషన్ తో ఈ మూవీలోనూ మ్యాజిక్ చేశాడు. ప్రతి సీన్ కొత్తగా ఉండటం, ఫీల్ గుడ్ మూడ్ కలిగించడంలో సక్సెస్ అయ్యాడు. అందుకే జులై 18న రిలీజైన ఈ సినిమా ఇప్పటి వరకు రూ.404 కోట్ల కలెక్షన్లు సాధించింది.



## యష్ రాజ్ ఫిల్మ్స్ నిర్మాణంలో అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్న 'వార్ 2'



### ఫస్ట్ సింగిల్ అప్డేట్.. హృతిక్ రోషన్, కియారా అద్వానీ పై చిత్రీకరించిన 'ఆవన్ జావన్'

యష్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్ మీద అయాన్ ముఖర్జీ భారీ ఎత్తున తెరకెక్కించిన చిత్రం 'వార్ 2'. ఐకానిక్ స్టార్‌లైన హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కాంబినేషన్‌లో రాబోతోన్న ఈ చిత్రంపై ఇప్పటికే అంచనాలు భారీ స్థాయిలో నెలకొన్నాయి. ఇప్పటికే విడుదల చేసిన టీజర్, ట్రైలర్‌లు సోషల్ మీడియాలో ట్రెండ్ సెట్ చేస్తున్నాయి.

తాజాగా ఈ మూవీకి సంబంధించిన ఫస్ట్ సింగిల్ అప్డేట్‌ను అయాన్ ముఖర్జీ ఇచ్చారు. 'వార్ 2' దర్శకుడు అయాన్ ముఖర్జీ ఈరోజు (జూలై 29) తన సోషల్ మీడియాలో 'వార్ 2' లోని మొదటి పాట 'ఆవన్ జావన్' గురించి పోస్ట్ వేశారు. సూపర్ స్టార్స్ హృతిక్ రోషన్, కియారా అద్వానీ నటించిన ఈ రొమాంటిక్ సాంగ్ గురించి చిత్రయూనిట్ అప్డేట్ ఇచ్చింది. బ్రహ్మాస్త్రలోని తన బ్లాక్ బస్టర్ పాట కేసరియా ఎంత గ్రాండ్ సక్సెస్ అయిందో అందరికీ తెలిసిందే. ఇక ఈ 'ఆవన్ జావన్' పాట కోసం ప్రీతమ్, అమితాబ్ భట్టాచార్య, అరిజిత్ సింగ్ అందరూ కలిసి ఈ ప్రత్యేకమైన పాట కోసం పని చేశారు. హృతిక్, కియారా కెమిస్ట్రీ ఈ పాటకు మరింత ప్రత్యేక ఆకర్షణ కానుంది. ఈ వారమే ఈ పాట అందరి ముందుకు రానుంది. 'వార్ 2' చిత్రం ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో హిందీ, తెలుగు, తమిళ భాషలలో విడుదలకానుంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. **Cell: 9391 544 889. RNI No: TGTEL/25/A0314**. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com